సాక్షి
ములుగు

శుక్రవారం | 28 | జూలై | 2023



మిర్చినారు వరద పాలు

మంగపేటలోని గౌరారం వాగు ఒడ్డు వెంట మిర్చి రైతులు లక్షల రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసిన నారుమడులు వరదలో కొట్టుకుపోయాయి. - 9లో▸



వరద బాధితులను ఆదుకోవాలి

మేడారంలోని వరద బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే సీతక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. - 9లో▸

గరిష్టం/కనిష్టం
28⁰ /24⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లుల నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వరదలు తగ్గాలని అమ్మవార్లకు పూజలు



ఎస్ఎస్‌తాడ్వాయి: వరదలు తగ్గుముఖం పట్టాలని సమ్మక్క సారలమ్మలకు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. జంపన్నవాగు వరదతో మేడారం చుట్టు పక్కల గ్రామాలు జలమయ్యం అయ్యాయి. గ్రామాల్లోకి వచ్చిన వరద శాంతించాలని వనదేవతలకు పూజలు చేశారు. వరదలో కూడా పసుపుకుంకుమ వదిలి వరదలు తగ్గుముఖం పట్టాలని వేడుకున్నారు. కార్యక్రమంలో తాడ్వాయి సర్పంచ్ ఇర్ప సునీల్, జనార్దన్, బోజారావు, ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

బొగతను పరిశీలించిన అధికారులు



వాజేడు: ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్న బొగత జలపాతాన్ని వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వర్ రావు, తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఆర్ఐ రాజు గురువారం పరిశీలించారు. బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో పర్యాటకులు బొగత సందర్శనకు రావొద్దని అధికారులు తెలిపారు.

నీట మునిగిన గోవిందరాజులు ఆలయం



ఏటూరునాగారం: మండల పరిధిలోని కొండాయి గ్రామంలో గోవిందరాజులు, నాగులమ్మ ఆలయం నీట మునిగాయి. పెద్ద చెరువు, జంపన్నవాగు ఉప్పొంగడంతో ఆలయం చుట్టూ వరద నీరు చేరింది. నాగులమ్మ ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు నీటిలో ఉండిపోయాయి. కొండాయి వాగు నుంచి ఇసుక తోడడం వల్ల వరద నీరంతా గ్రామంలోకి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు.

ఐటీడీఏ స్కూళ్లలోకి వరద నీరు



ఏటూరునాగారం: తాడ్వాయి మండల పరిధిలోని ఊరట్టం, మేడారం ఇంగ్లిష్‌మీడియం , మల్యాల ఆశ్రమ పాఠశాల, గోవిందరావుపేట మండలం ప్రాజెక్టు నగర్ ఆశ్రమ పాఠశాలల్లోకి వరద నీరు చేరడంతో విద్యార్థులను ముందస్తుగా తరలించారు. మల్యాల పాఠశాల విద్యార్థులను వార్డెన్ పాయం మీనయ్య ఇంటికి తరలించి వారిని సంరక్షించారు. అలాగే ఎలిశెట్టిపల్లిలోని ప్రజలు ప్రభుత్వ పాఠశాల ఎక్కి తలదాచుకున్నారు. అలాగే ప్రాజెక్టు నగర్ విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజనం, వసతి కల్పించారు.

ఆరు గ్రామాలకు రాకపోకలు బంద్



ఏటూరునాగారం: మండల పరిధిలోని వీరాపురం, అల్లంవారిఘణపురం, చెల్పాక, బన్నాజీబంధం, ఎలిశెట్టిపల్లి, కొత్తూరు గ్రామాల చుట్టూ జంపన్నవాగు, పెద్ద చెరువు వరద వరద వచ్చి చేరడంతో రాకపోకలు బందు అయ్యాయి. మండల కేంద్రానికి ఆయా గ్రామాల ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గిరిజన గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో ఎవరు వెళ్లకుండా అధికారులు ట్రాక్టర్లను అడ్డు పెట్టి వాగులు దాటకుండా చర్యలు చేపట్టారు.



ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



జలమయమైన ములుగు- జంగాలపల్లి 163 జాతీయ రహదారి



జలదిగ్బంధం

జిల్లాలో భారీ వర్షం
- పొంగిపొర్లిన వాగులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, ఎస్పీ
- పస్రా సమీపంలో కోతకు గురైన జాతీయ రహదారి
- నిలిచిపోయిన రాకపోకలు

ములుగు: ఆకాశానికి చిల్లు పడినట్లుగా బుధవారం అర్ధరాత్రి నుంచి జిల్లాలో భారీ వర్షం కురిసింది. దీంతో జిల్లాలోని ఆయా గ్రామాల పరిధిలోని చెరువులు మత్తళ్ల పోస్తున్నాయి. గోవిందరావుపేట మండల పరిధిలోని గుండ్ల వాగుకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో దయ్యాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పస్రా సమీపంలో బ్రిడ్జి వద్ద జాతీయ రహదారి కొట్టుకుపోయింది. ములుగు జిల్లా కేంద్రంలో మహర్షి కళాశాల ఎదుట, జిల్లా కోర్టు భవనం ఎదుట ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీరు నిలిచి పోయింది. జంగాలపల్లి సమీపంలో మేడివాగుకు వచ్చే వరద కారణంగా జాతీయ రహదారికి రెండు వైపులా వరద చేరుకుంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు రోడ్లను బ్లాక్ చేశారు. మధ్యాహ్నం వరకు ములుగు నుంచి ఏటూరునాగారం వైపునకు రాకపోకలు నిలిచిపోయాయి. పస్రా సమీపంలోని బ్రిడ్జి పక్కన ఉన్న రోడ్డు కొట్టుకు పోవటంతో అధికారులు ఏటూరునాగారం వైపునకు వెళ్లే వాహనాలను నార్లాపూర్, మేడారం మీదుగా మళ్లించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే మేడారం జంపన్నవాగు బ్రిడ్జి పైనుంచి వరద తీవ్రతరం కావటం మేడారం, వెంగళాపురం ప్రాంతాలు పూర్తిగా నీటి మయంగా మారటంతో నిరాకరించారు. డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య గోదావరి పరీవాహక ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించేందుకు వెళ్లగా జాతీయ రహదారి బ్లాక్ కావటంతో జంగాలపల్లి వద్దనే ఆగిపోయారు. ములుగు మండలంలోని లోకం చెరువుకు భారీ వరద నీరు చేరుకోవటంతో మత్తడి ఉధృతంగా ప్రవహించింది. జాకారం, గట్టమ్మ మధ్యలోని పానిషా కాల్వకు వరద ఉధృతి పెరగటంతో జాతీయ రహదారి కొంత మేర కొట్టుకుపోయింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ గాష్ ఆలం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా జంగాలపల్లి సమీపంలో రోడ్డు బ్లాక్ కావటంతో రాక పోకలు నిలిచిపోయాయి. ఎస్పీ గాష్ఆలం ఎన్డీఆర్ఎఫ్ టీమ్‌తో పాటు ఎలాంటి ప్రమాదకర ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. మేడివాగు వద్ద



జలమయమైన కొండాయి గ్రామం



మేడివాగు సమీపంలో అధికారులను అప్రమత్తం చేస్తున్న డీఎస్పీ రవీందర్

డీఎస్పీ రవీందర్ స్థానిక పోలీసులతో కలిసి రాకపోకల విషయంలో తగిన చర్యలు తీసుకున్నారు. పస్రాలో అధిక వర్షాల కారణంగా పలు ఇళ్లు జలమయంగా మారాయి. రామప్పకు చేరుతున్న వరద ఉధృతికి పల్సాపల్లి, జీవంతరావు పల్లి, వెంకటాపురం మండల పరిధిలోని పాపయ్యపల్లి, గ్రామాలు జలమయంతో నిండిపోయాయి.

జిల్లాలో రెడ్ అలర్ట్..

ములుగు జిల్లాకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం నుంచి వర్షాలు అందుకోవటంతో మరింత సమస్యగా మారింది. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల ఇల్లు కూలిపోయాయి. పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగింది, గోదావరి ప్రాంతంలో వరదల కారణంగా ఇసుక మేటలు వేసింది. వరద ఉధృతి తగ్గితే జరిగిన నష్టం తెలిసే అవకాశం ఉంది. మేడారం చుట్టు పక్కల గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి.



పస్రాలో నీట మునిగిన ఇల్లు

భారీ నష్టం

అల్పపీడనం తీవ్రత కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో గురువారం సాయంత్రం వరకు నలుగురు మృతి చెందారు. 247 పశువులు మృత్యువాత పడగా 64 ఇళ్లు ధ్వంసం అయ్యాయి. నాలుగు చోట్ల బ్రిడ్జిలు, రహదారులు కొట్టుకుపోయినట్లు అధికారికంగా ప్రకటన వెలువడింది.

కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలను చుట్టిముట్టిన వరద

ఏటూరునాగారం: మండల పరిధిలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలను జంపన్నవాగు, పెద్ద చెరువు వరద చుట్టుముట్టింది. ఆయా గ్రామాల చుట్టూ వరద నీరు చేరడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బట్టలు, చిన్న చిన్న వస్తువులను పట్టుకొని వరదలో నడుచుకుంటూ సురక్షిత ప్రాంతాలకు ప్రజలు తరలివెళ్లారు. ముందుగా అధికారులు మల్యాల ఆశ్రమ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయగా అక్కడికి కూడా నీరు చేరడంతో కొండాయి సర్పంచ్ కాక వెంకటేశ్వర్ల ఇంటికి కొత్తూరు గోవిందరాజుల కాలనీ వాసులు వెళ్లినట్లు పంచాయతీ కార్యదర్శి సతీష్ తెలిపారు. కొండాయి బ్రిడ్జి పైనుంచి వరద నీరు పోవడంతో ఈ సారి బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉందని సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను రక్షించేందుకు సర్పంచ్ ఇంటింటికీ తిరుగుతూ సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. ఆయా గ్రామాలను ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ వీరస్వామి సందర్శించిన అనంతరం కొండాయి బ్రిడ్జి వద్ద బారీకేడ్లను ఏర్పాటు చేశారు. కొండాయి గ్రామానికి చెందిన ఎం.లక్ష్మయ్య పెంకుటిల్లు నేలమట్టం అయ్యింది.

అప్రమత్తంగా ఉండండి..

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ గాష్ఆలం

రానున్న 24 గంటల పాటు జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. రెవెన్యూ పంచాయితీ రాజ్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు అయా గ్రామాల్లో బస చేయాలని సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ చాంబర్ నుంచి తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ఆయా శాఖల అధికారులతో టెలికాన్ఫరేన్స్ నిర్వహించారు. వెంకటాపురం (ఎం) మండల పరిధిలోని బూరుగుపేట శివారులోని మాథేడు కుంట చెరువుకు గండి పడిందని అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ తరపున తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వెంకటాపురం (కె) మండల పరిధిలోని వీరభద్రవరం సమీపంలోని ముత్యంధార జలపాతం నుంచి 84 మందిని తెల్లావారు జామున 3.30 గంటలకు మండల కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ విజయ భాస్కర్, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రసూన రాణి, డీఆర్‌డీఓ నాగపద్మజ, డీపీఓ వెంకయ్య, డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వరద
- గల్లంతై పలువురి మృతి

రైలుబోగీల్లోనే 10గంటలు
- రైల్వేట్రాక్‌ను తాకిన వరద

గద్దెలను తాకిన జంపన్నవాగు
- జలదిగ్బంధంలో మేడారం

‘ముత్యంధార’ పర్యాటకులు సేఫ్
- కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

- వివరాలు 8లో▸

- మరిన్ని ఫొటోలు 9లో▸

జిల్లాకు స్పెషల్ అధికారిగా కృష్ణఆదిత్య

వరద బాధిత ప్రాంతాల ప్రజలకు సమస్యలు ఎదురుకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ములుగు జిల్లాలో కలెక్టర్‌గా విధులు నిర్వహించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సెక్రటరీగా బదిలీ అయిన కృష్ణ ఆదిత్యను స్పెషల్ అధికారిగా నియమించింది. గతంలో మూడు సంవత్సరాలకు పైగా విధులు నిర్వహించి జిల్లాపై పట్టు ఉండటంతో వర్షాలు తగ్గేంత వరకు విధులు నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు కృష్ణఆదిత్య మరోసారి జిల్లాకు రానున్నారు.

రెస్క్యూ ఆపరేషన్‌లో పోలీస్ టీమ్

వరుస వర్షాలతో పోలీస్ శాఖ తరపున రెస్క్యూ టీమ్‌ను ఎస్పీ గాష్ఆలం అప్రమత్తం చేశారు. గోవిందరావు పేట మండల పరిధిలోని పస్రాలోని అభ్యుదయ కాలనీలో మూగ జీవాలు జల దిగ్బంధంలో ఉన్నాయని తెలిసి రెస్క్యూ ఆపరేషన్, సీఐ శంకర్, డిజాస్టర్ అండ్ రెస్పాన్స్ ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో కాపాడి జిల్లా పరిషత్ పాఠశాలకు తరలించారు. గట్టమ్మ ఆలయం సమీపంలో 50 మంది ప్రయాణికులతో వస్తున్న బస్సు ప్రవాహంలో చిక్కుకు పోగా డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో సురక్షితంగా కాపాడారు.

కొట్టుకుపోయిన కొండాయి బ్రిడ్జి



ముంపు నుంచి బయటకు చేరిన భక్తులు, వ్యాపారులు



చిన్నబోయిన పల్లికి చేరుతున్న దొడ్ల ముంపు ప్రజలు

- ఎనిమిది మంది గల్లంతు

ఏటూరునాగారం: మండల పరిధిలోని కొండాయి బ్రిడ్జి జంపన్నవాగు ఉధృతికి కొట్టుకుపోయింది. మూడేళ్ల క్రితం రెండు స్లాబ్‌లు కుంగిపోయి ఉండగా దానిని మరమ్మతులు చేయించకపోవడంతో కొండాయి బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో రాకపోలకు నిలిచిపోయాయి. మల్యాల, కొత్తూరు, కొండాయి ప్రజలను కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్ దళాలు వాగుదాటలేక వెనుకకు తిరిగివెళ్లాయి. దీంతో దొడ్ల గ్రామాల ప్రజలను ముందస్తుగా మండలంలోని చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాలకు స్కూల్ బస్సుల్లో పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి అధికారులు కావాల్సిన వసతులు కల్పించినట్లు జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి, ఎంపీడీ కుమార్ తెలిపారు. కొండాయి వద్ద జంపన్నవాగు ఉధృతికి కరకట్ట ఆకస్మాతుగా వచ్చిన వరదకు కొండాయి గ్రామానికి చెందిన మజీద్‌ఖాన్, రషీద్, షరీఫ్, హజార్, మహబూబ్ హుస్సేన్, రషీద్‌ఖాన్, ఖరీమా, కొండాయి సర్పంచ్ కాక వెంకటేశ్వర్ల అత్త గల్లంతు అయ్యారు. వీరి ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ దళాలు రంగంలోకి దిగాయి. బూటారం గ్రామం చుట్టూ జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో 80కుటుంబాలను ఖాళీ చేయిస్తున్నట్లు సర్పంచ్ ఈసం రామ్మూర్తి తెలిపారు.

40మందిని రక్షించిన ఎన్డీఆర్ఎఫ్ దళాలు

వన దేవతలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు, వ్యాపారులు వరద నీటిలోనే ఉండిపోయారు. గురువారం ఎన్డీఆర్ఎఫ్ దళాలు భక్తులు సేద తీరుతున్న షెడ్ల వద్దకు పడవను తీసుకెళ్లి రేకులు తొలగించి అందులోని భక్తులు, ఒడ్డు వెంట ఉన్న వ్యాపారులు, చెట్ల కొమ్మలను పట్టుకుని ఉన్న సుమారుగా 40మందిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్

రాకపోకలు బంద్



వాజేడు: హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

వాజేడు: మండల పరిధిలోని టేకులగూడెం గ్రామ సమీపంలోని 163వ నంబర్ జాతీయ రహదారిపైకి గోదావరి వరద వచ్చి చేరింది. దీంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరద క్రమేపీ పెరుగుతుండటంతో రేగు మాకు ఒర్రె నుంచి రహదారిపైకి వరద నీరు వచ్చి చేరింది. ఈ విషయం తెలుసుకున్న మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, తహసీల్దార్ సయ్యద్ సర్వర్, పేరూరు ఎస్సై అశోక్, తదితరులు అక్కడకు చేరుకుని ఎన్‌హెచ్‌పై నుంచి ఎవరూ వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ట్రాక్టర్లను అడ్డుగా పెట్టారు.

‘మత్తడి పోస్తున్న రామప్ప, మల్లూరు’



మత్తడి పోస్తున్న రామప్ప సరస్సు

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేట పరిధిలో గల రామప్ప సరస్సు గురువారం నుంచి మత్తడి పడుతోంది. 35 అడుగుల నీటిమట్టం గల రామప్ప సరస్సులోకి 37 అడుగుల నీటిమట్టం వచ్చి చేరడంతో రెండు అడుగుల మేర మత్తడి పడుతోంది. దీనితో రామప్ప ఆలయ తూర్పు రోడ్డు మీదుగా మత్తడి నుంచి వచ్చే వరద ప్రవాహం వెళ్తుండడంతో తూర్పు రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకపోయింది. రామప్ప సరస్సును ఎంపీపీ బుర్ర రజిత, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ శ్రీనివాస్ అప్రమత్తం చేశారు.



మల్లూరువాగు ప్రాజెక్టు..
మల్లూరు ప్రాజెక్టు..

మంగపేట: మండల పరిధిలోని నర్సింహసాగర్ లోని మల్లూరు మధ్యతరహా ప్రాజెక్టు గురువారం నుంచి మత్తడి పోస్తుంది. భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చిచేరడంతో 29.52 అడుగుల వరకు నీరు చేరుకోవడంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. గురువారం నుంచి ప్రాజెక్టు మత్తడి పోస్తుండడంతో ప్రాజెక్టును ఇరిగేషన్ డీఈ రవికుమార్, ఏఈ వలీమ్‌మహ్మద్ పరిశీలించారు. ప్రస్తుతం 9.05 మీటర్ల నీటిమట్టం ప్రాజెక్టులో ఉందని తెలిపారు.

మేడారంలో పీఓ పర్యటన


ఎస్ఎస్‌తాడ్వాయి: మండల పరిధిలోని మేడారంలో ఐటీడీఏ పీఓ అంకిత్ గురువారం పర్యటించారు. జంపన్నవాగు భారీ వరదకు మేడారం జలమయం కావడంతో ఇళ్లు, దుకాణాలు నీటమునిగిపోవడంతో ఆయన మేడారాన్ని సందర్శించారు. వరదలతో జరిగిన నష్టాలపై ఆరా తీశారు. అనంతరం మేడారం ఇంగ్లిష్ మీడియం పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. వరద ముంపులో ఉన్న ఊరట్టం ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థినుల గురించి ఆరా తీశారు.



వరద నష్టంపై ఆరా తీస్తున్న పీఓ అంకిత్

పాఠశాలకు వరద చేరడంతో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై పీఓ పాఠశాల నిర్వాహకులను ఫోన్‌లో ఆదేశించారు.

పెరుగుతున్న గోదావరి



ముళ్లకట్ట వద్ద గోదావరి..

ఏటూరునాగారం: ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండడంతో గోదావరి, వాగులు పొంగిపొర్లుతున్నాయి. జంపన్న వాగు వంతెనలకు సమీపంగా ప్రవహిస్తుండంతో ప్రయాణికులు బిక్కు బిక్కుమంటూ వంతెన దాటుతున్నారు. ముళ్లకట్ట వద్ద గోదావరిపై నిర్మించిన వంతెన సమీపం నుంచి గోదావరి వరద ప్రవహిస్తుంది. కాగా మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి వరద గురువారం సాయంత్రం నాటికి 14.02 మీటర్ల ఎత్తున ప్రవహిస్తోంది. 14 .830 మీటర్లకు చేరితే అధికారులు మొదటి హెచ్చరికను జారీ చేయనున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, ఆకులవారిఘణపురం ప్రాంతంలోని హైవే రోడ్డు పక్కన గల ఇళ్లల్లోకి జంపన్నవాగు వరద నీరు చేరుతోంది.

సమ్మక్క సాగర్ 59 గేట్లు ఓపెన్



కన్నాయిగూడెం: సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద..

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామం వద్ద గోదావరి పై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ ఉగ్రరూపం దాల్చింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు గోదావరిపై ఉన్న జలాశయాల నుంచి నీరు దిగువకు చేరడంతో గురువారం ఉగ్రరూపం దాల్చి ప్రవాహం పరవళ్లు తొక్కుతుంది. ఎగువన ఉన్న సరస్వతి, లక్ష్మీ బ్యారేజీలతో పాటు మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో గోదావరిలోకి భారీగా వరదనీరు చేరడంతో సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి 801180లక్షల క్యూసెక్కుల నీరు చేరడంతో 59 గేట్లు ఎత్తి నీటిని అదేమోతాదులో దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

మోరంచవాగులో చిక్కుకున్న కార్మికులు


కార్మికులను రక్షించేందుకు వెళ్లిన హెలికాప్టర్

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని నైన్‌పాక శివారు మోరంచవాగు బ్రిడ్జి నిర్మాణానికి కూలీలుగా పని చేస్తున్న ఆరుగురు కార్మికులు వరద ఉధృతిలో చిక్కుకున్నారు. వీరిని రక్షించడానికి స్థానిక జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎస్సై రమేష్‌లు ఎమ్మెల్యే, కలెక్టర్‌లకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన వారు రెండు హెలికాప్టర్లను పంపించి వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించారు. వరదల్లో చిక్కుకున్న బీకే ఆరుంగ్, బీపిన్ అరుణ్, గానో, ఉత్తమ్, మున్న, రోహిత్‌లు అస్సాం, జార్ఖండ్‌లకు చెందిన కార్మికులు బ్రిడ్జి పనులు చేస్తూ అక్కడే నివాసముంటున్నారు. వారితోపాటు మరో 20 మంది కార్మికులు రోజు మాదిరిగానే బుధవారం రాత్రి పడుకున్నారు. ఈక్రమంలో తెల్లవారు జాయిన ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో కొంత మంది అప్రమత్తమై పరుగులు తీసుకుంటూ సురక్షితంగా బయటికి వచ్చారు. ఆరుగురు మాత్రం అక్కడే ఉండిపోయారు. దీంతో వరద పెరగడంతో జేసీబీపై కూర్చొని ఆర్తనాదాలు పెట్టారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలానికి చేరుకున్నారు.

వాగులో చిక్కుకున్న ట్రాక్టర్

- క్షేమంగా బయటపడిన రైతు


క్షేమంగా బయటపడిన లచ్చిరాం

కురవి: మానుకోట జిల్లా కురవి మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) శివారు బంగారుగూడెం జీపీ పరిధిలోని చౌళ్ల తండా వద్ద పొలాలు దున్నేందుకు వెళ్లిన ట్రాక్టర్ మున్నేరువాగు వరద నీటిలో గురువారం మునిగిపోయింది. బంచరాయి తండా గ్రామానికి చెందిన రైతు బానోత్ లచ్చిరాం చౌళ్ల తండాకు చెందిన పొలాలను దున్నేందుకు ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. ఈక్రమంలో మున్నేరు వాగు ప్రవాహం పెరిగింది. రెండువైపులా నీరు వచ్చి చేరుతుండడంతో నీటిలో ట్రాక్టర్ మునిగిపోయింది. దీంతో లచ్చిరాం ట్రాక్టర్‌ను అక్కడే వదిలి ఈదుకుంటూ ఒడ్డుకు చేరాడు. నీటిలో ట్రాక్టర్ మునిగిపోయిన విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు.

ప్రాణం తీసిన వరద

- వాననీటిలో కొట్టుకుపోయిన కుటుంబం
- గల్లంతై మృతి చెందిన అన్నదమ్ములు
- కాల్వలోపడి కూలీ మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న ఎడతెరిపిలేని వానలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పలుచోట్ల చెరువుకట్టలు, కల్వర్టులు, రోడ్డు తెగిపోవడంతో వరదనీటి ప్రవాహంలోపడి పలువురు మృత్యువాతపడ్డారు. ములుగు జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వరద నీటిలో కొట్టుకుపోవడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

కుటుంబం గల్లంతు


మారేడుగొండ చెరువుకు గండి పడిన ప్రదేశం


బండ సారయ్య మృతదేహం

వెంకటాపురం(ఎం): బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని బుర్గుపేట పరిధిలోని మారేడుగొండ చెరువుకు గురువారం తెల్లవారు జామున మూడు చోట్ల గండి పడింది. దీంతో చెరువు పక్కనే ఉన్న బండ సారయ్య ఇల్లు వరద ఉధృతికి కూలిపోగా.. సారయ్యతోపాటు భార్య సారమ్మ, తల్లి రాజమ్మలు వరద నీటిలో కొట్టుకపోయారు. గురువారం ఉదయం సారయ్య మృతదేహం లభ్యమైనప్పటికీ మిగిలిన ఇద్దరి ఆచూకీ లభించలేదు. వెంకటాపురం ఎస్సై తాజుద్దీన్‌తోపాటు గ్రామస్తులు గాలించినా ప్రయోజనం లేదు. చెరువుకు గండి పడడంతో సుమారు 25 ఎకరాల్లో ఇసుక మేట వేయగా, ఇటీవల వేసిన వరినాట్లు పూర్తిగా మునిగిపోయాయి. చెరువు కింద 1,500ఎకరాల ఆయకట్టు సాగు చేసేందుకు వీలు లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండి కారణంగా బుర్గుపేట గ్రామానికి ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. మారేడుగొండ చెరువుకు గండి ప్రదేశాన్ని ఎమ్మెల్యే సీతక్క, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, పలువురు నాయకులు, అధికారులు సందర్శించారు.

వాగులో పడి అన్నదమ్ముల మృతి


యాకయ్య(ఫైల్)


శ్రీను (ఫైల్)

పెద్దవంగర: దశదిన కర్మకు వెళ్లివస్తున్న అన్నదమ్ములను వాగు ప్రవాహం రూపంలో మృత్యువు వెంటాడింది. బుధవారం రాత్రి నీటి ప్రవాహంలో గల్లంతైన ఇద్దరు మృతి చెందారు. గురువారం ఎస్సై రాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన పిండి యాకయ్య (40), పిండి శ్రీను (35) సూర్యాపేట జిల్లా తిర్మలగిరి మండల కేంద్రానికి చెందిన తమ బంధువైన కడారి యాకయ్య మృతి చెందగా.. దశదిన కర్మ కార్యక్రమానికి బుధవారం వెళ్లారు. తిరుగుప్రయాణంలో బస్సులో వస్తున్నక్రమంలో గ్రామానికి కొద్దిదూరంలో వర్షం కారణంగా రోడ్డు తెగిపోయింది. బస్సు వెళ్లలేని పరిస్థితుల్లో బస్సు డ్రైవర్ తిరిగి వెనక్కి తీసుకెళ్తుండగా.. వీరిద్దరూ నడుచుకుంటూ వెళ్తామని బస్సు దిగి వెళ్తున్న క్రమంలో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. గురువారం ఉదయం పోచంపల్లి గ్రామానికి చెందిన సుదగాని మనోహర్ తన పొలం వద్దకు వెళ్లగా రెండు మృతదేహాలు కనిపించడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి సోమనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా.. అన్నదమ్ముల మృతి వార్త తెలుసుకున్న మంత్రి దయాకర్‌రావు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేసి పిల్లల చదువుకు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

కూలీ మృతి


సంజీవ్ మృతదేహం

భూపాలపల్లి రూరల్: కుండపోత వానలతో వస్తున్న వరదతో భూపాలపల్లిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కొంపల్లి -మహబూబ్‌పల్లి గ్రామాల మధ్య వరదల్లో చిక్కుకొని సైడ్ కాలువలో పడి జోగు సంజీవ్ (40) గురువారం మృతి చెందాడు. పట్టణంలోని తొమ్మిదో వార్డుకు చెందిన సంజీవ్ కూలీ పని కోసం కొంపల్లికి వెళ్తుండగా.. మహబూబ్ పల్లి, పిల్లోనిపల్లి గ్రామాల మూలమలుపు వద్ద సైడ్ కాల్వలో పడి వరద ఉధృతికి మోరీలో ఇరుక్కొని మృతి చెందాడు. కొంపల్లి, పిల్లోనిపల్లి గ్రామాల రైతులు జేసీబీ సాయంతో సంజీవ్ మృతదేహాన్ని బయటకు తీశారు.

వాగులో పడి వ్యక్తి..


మహేందర్ (ఫైల్)

ధర్మసాగర్(వేలేరు): ప్రమాదవశాత్తు వాగులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం వేలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కన్నారం గ్రామ శివారులో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కన్నారం గ్రామానికి చెందిన పొన్నాల మహేందర్ (32) గురువారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం తరిగొప్పుల వైపు వెళ్తూ.. కన్నారం చెరువు మత్తడి నీటిలో ద్విచక్ర వాహనంతో సహా పడి కొట్టుకుపోయాడు. ఘటనాస్థలానికి చేరుకున్న ధర్మసాగర్ సీఐ రమేష్, వేలేరు ఎస్సై హరిత, తహసీల్దార్ సమ్మయ్య స్థానికుల సాయంతో మహేందర్ మృతదేహాన్ని వెలికితీశారు.

వరదల్లో యువకుడి గల్లంతు..


గట్టు రాజు (ఫైల్)

హసన్‌పర్తి: భారీ వర్షాలకు 56వ డివిజన్ టీఎన్జీవోస్ కాలనీ-2లో గురువారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. శివనగర్‌కు చెందిన గట్టు రాజు(37), 56 వ డివిజన్ టీఎన్జీవోస్ కాలనీ-2లో అద్దె ఇంట్లో భార్య పిల్లలతో ఉంటున్నాడు. భారీ వర్షాల కారణంగా టీఎన్జీవోస్ కాలనీ జలదిగ్బంధమైంది. అయితే ఉదయం ఇంటి నుంచి కిందకి వచ్చి వరద ప్రవాహంలో కొట్టుకుపోయాడు. దీంతో కుటుంబసభ్యులు కాలనీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి సదానందంలకు సమాచారం అందించారు. గట్టు రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనాస్థలాన్ని హనుమకొండ ఏసీపీ కిరణ్‌కుమార్ సందర్శించారు.

రైలుబోగీల్లోనే 10 గంటలు


ట్రాక్ వద్ద గూడ్స్ రైలును మెకానిక్‌తో సెక్యూరింగ్ చేయిస్తున్న రైల్వే టీఐ


కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో నిలిచిన పలు రైళ్లు

- రైల్వేట్రాక్‌కు తాకుకుంటూ వరద
- నిలిచిన రైళ్లు.. ప్రయాణికుల ఇక్కట్లు

కాజీపేట రూరల్/కాశిబుగ్గ/ నెక్కొండ: ఎడతెరిపి లేని వర్షాలతో కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలోని వడ్డేపల్లి చెరువు రిజర్వాయర్‌పై నిర్మించిన రైల్వే వంతెన ట్రాక్‌పైకి వరద నీరు ఉధృతంగా చేరడంతో గురువారం రైల్వే అధికారులు రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. దీంతో సుమారు 10గంటలపాటు ప్రయాణికులు రైలు బోగీల్లోనే నిరీక్షించారు. వడ్డెపల్లి చెరువు కట్టపై 364/27-25 కి.మీ నంబర్ వద్ద రైల్వే ట్రాక్ డేంజర్‌గా మారడంతో కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో తిరుపతి-కరీంనగర్, ఎర్నాకులం-బిలాస్‌పూర్, యశ్వంత్‌పూర్-లక్నో, బెంగళూర్-నిజాముద్దీన్ వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఉదయం 10:30 గంటల నుంచి నిలిపివేశారు. కాజీపేట-ఢిల్లీ, వరంగల్-ఢిల్లీ అప్ అండ్ డౌన్ రూట్‌లో రైళ్ల రాకపోకలను రద్దు చేశారు. పలు రైళ్లను దారి మళ్లించారు. సికింద్రాబాద్ బ్రిడ్జి, ట్రాక్ ఇంజనీర్స్, కాజీపేట జంక్షన్‌కు చెందిన అధికారులు వడ్డెపల్లి రైల్వే ట్రాక్ వద్ద నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించారు. ట్రాక్ సామర్థ్యం టెస్టింగ్ కోసం ట్రాక్‌పై గూడ్స్ రైలును నిలిపి ఉంచారు. రాత్రి 8 గంటల వరకు ఇదే పరిస్థితిలో రైల్వే అధికారులు సెక్యూరింగ్ చేశారు. కాగా కాజీపేట రైల్వే చరిత్రలో వడ్డెపల్లి చెరువు రైల్వే ట్రాక్‌పైకి వరద నీరు చేరడం ఇదే మొదటిసారి. అయితే రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు రైలు పట్టాలపై నడుచుకుంటూ సమీప దుకాణాల వద్దకు వెళ్లి తినుబండారాలు కొనుగోలు ఆకలితీర్చుకున్నారు. వరంగల్ సమీప గ్రామాల ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లిపోయారు. సుమారు 10గంటల తర్వాత గురువారం రాత్రి రైళ్ల రాకపోకలకు రైల్వే అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ట్రాక్ వద్ద వరద ప్రవాహం తగ్గడంతో రైల్వే ఇంజనీరింగ్ అధికారులు ట్రాక్ కెపాసిటిని పరిశీలించి మొదటి, రెండో లైన్‌లకు రాత్రి 8:30 గంటలకు క్లీయర్ ఇచ్చారు. ముందుగా లైట్ ఇంజన్ నడిపించి ఆతర్వాత 10 నుంచి 30 కెంఎంపీహెచ్ స్పీడ్‌తో ఢిల్లీ వైపు యశ్వంత్‌పూర్- బిలాస్‌పూర్, తర్వాత రాజధా, లక్నో, తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లను పంపించినట్లు తెలిపారు.

కాజీపేట జంక్షన్ జలమయం

వర్షపునీరు కాజీపేట జంక్షన్‌లోని టికెట్ బుకింగ్ కౌంటర్ల వద్దకు, ఎంట్రెన్స్ ఎదుట, ప్లాట్‌ఫాం పైకి చేరడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

- న్యూ ఢిల్లీ వెళ్లే ఏపీ, తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను అధికారులు గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో వరంగల్ రైల్వే స్టేషన్ రెండు, మూడు ప్లాట్ ఫాంలలో నిలిపివేశారు. రైళ్లలో శుక్రవారం ఐఐటీ ఢిల్లీ కళాశాలలో చేరేందుకు వెళ్తున్న విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఉదయం చెన్నై నుంచి న్యూఢిల్లీ వెళ్లే గ్రాండ్ ట్రంక్(జీటీ) ఎక్స్‌ప్రెస్‌కు వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం రేకు తగలడంతో రైలు ఆగిపోయింది.
- రప్తీసాగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (గోర్కపూర్-కొచువేలి) రైలు నెక్కొండ రైల్వేస్టేషన్‌లో గురువారం ఉదయం 11గంటలకు నిలిచిపోయింది. స్టేషన్‌లో ఎలాంటి సౌకర్యాలు లేక పోవడం.. తినుబండారులు సైతం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యామని ప్రయాణికులు తెలిపారు.

31లోపు ఫార్మసీ కౌన్సిల్ రెన్యూవల్ చేసుకోవాలి

ఎంజీఎం: రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోందని ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షుడు ఉప్పు భాస్కర్ గురువారం తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని తెలంగాణలో అడ్రస్ కలిగి ఉన్న ఫార్మసిస్టులు ఈనెల 31లోగా.. తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌లో రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే తెలంగాణలో రెన్యూవల్, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి అడ్రస్ మార్పు, మొబైల్ నంబర్లు, ఈ -మెయిల్ మార్పు చేసుకునేందుకు ఫార్మసిస్ట్ రిజిస్ట్రేషన్ నంబర్, చిరునామాను ఆన్‌లైన్, పోస్టు ద్వారా హైదరాబాద్‌లోని కౌన్సిల్ రిజిస్ట్రార్‌ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- సహాయక చర్యల్లో స్వయంగా పాల్గొనాలి
- టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



హన్మకొండ: ప్రజలకు సేవ చేసేందుకు ఇది సరైన సమయమని కష్టాల్లో ఉన్నప్పుడే వారిని ఆదుకుంటే గుర్తుపెట్టుకుంటారని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం రాత్రి ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, వరంగల్ నగర మేయర్, కమిషనర్, పోలీసు కమిషనర్, ఏసీపీలు, స్థానిక ప్రజాప్రతినిధులతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు టెలికాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వరద ముంపు ప్రాంతాల ప్రజలకు అండగా నిలబడి, సాయం చేయాలని సూచించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెండు రోజుల పాటు తాను స్వయంగా నీటి మునిగిన ప్రాంతాలను పరిశీలించినట్లు చెప్పారు. ముంపునకు గురైన ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులుగా మనపై ఉందన్నారు. సీఎం కేసీఆర్ స్వయంగా పరిస్థితి సమీక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని అన్నారు. ప్రజలు ఉపశమనం పొందే వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు వారికి అందుబాటులో అండగా నిలవాలని చెప్పారు.

గద్దెలను తాకిన జంపన్నవాగు


నీట మునిగిన మేడారం హరిత హోటల్ పరిసర ప్రాంతాలు


వరద నీటిలో నుంచి సామగ్రి తరలిస్తున్న వ్యాపారులు

జలదిగ్బంధంలో మేడారం

- రాత్రికి రాత్రే పోటెత్తిన వరద
- బిక్కుబిక్కుమంటున్న అడవిబిడ్డలు

ఎస్ఎస్ తాడ్వాయి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీరు మేడారాన్ని ముంచెత్తింది. జంపన్నవాగు రెండు వంతెనల పైనుంచి సుమారు 10 అడుగుల ఎత్తున వరద ప్రవహిస్తోంది. దీంతో మేడారం సమ్మక్క సారలమ్మ ఐలాండ్ ప్రాంత్రం, గ్రామంలోని బొడ్రాయి సమీపానికి వరద రావడంతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. మేడారం, రెడ్డిగూడెం, ఊరట్టం గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలో ఉన్నాయి.

గద్దెలను చుట్టిన వరద

మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల చుట్టూ వరద చేరింది. జంపన్నవాగు ప్రవాహం వరద అమ్మవార్ల గద్దె చుట్టూ చేరడం ఇదే మొదటి సారి. ఎప్పుడు వర్షాకాలంలో ఐటీడీఏ కార్యాలయం వరకే వరద చేరేది. జంపన్నవాగు చిలకలగుట్ట దారి నుంచి ప్రవాహం భారీగా చేరడంతో వరద మరింత ముంచెత్తింది. రెండంతస్తుల భవనాలు సైతం నీట మునిగిపోవడం గమనార్హం.

మునిగిన ఊరట్టం.. గుట్టపైకి చేరిన జనం

భారీ వరదకు ఊరట్టం నీట మునిగిపోయింది. జంపన్నవాగు, తూముల వాగు వరద గ్రామంలోకి చేరడంతో డబుల్ బెడ్రూం ఇళ్లతోపాటు మొత్తం మునిగింది. బాలికల ఆశ్రమ పాఠశాలలో భవనం మొదటి అంతస్తు వరకు వరద చేరడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రజలంతా కట్టుబట్టలతో ఇళ్లను వదిలి సమీప గుట్టపైకి చేరుకున్నారు.

జలదిగ్బంధంలో గ్రామాలు..

మండలంలోని నార్లాపూర్, పడిగాపూర్, ఎల్బాక, వెంగళాపూర్, కాల్వపల్లి గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వెంగళాపూర్‌లో ఇళ్లు నీట మునిగాయి. నార్లాపూర్‌లో బొడ్రాయి వరకు వరద కమ్మేసింది. కాల్వపల్లిలోని 40 ఇళ్లలోకి వరద చేరింది. ఇంతకు ముందెప్పుడు ఇలాంటి పరిస్థితి గ్రామాల్లో చూడలేదని వెంగళాపూర్, నార్లాపూర్ ప్రజలు తెలిపారు.

వ్యాపారులకు భారీ నష్టం

జంపన్నవాగు వరద మేడారంలోకి చేరడంతో చిరు వ్యాపారులకు భారీ నష్టం వాటిల్లింది. గతంలో హరిత హోటల్ నీడ చెట్టుకు వరకు మాత్రమే జంపన్నవాగు వరద వచ్చేది. బుధవారం అర్ధరాత్రి వరకే వరద ఐటీడీఏ క్యాంప్ కార్యాలయం వరకు చేరడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. షాపుల్లోకి వరద చేరడంతో నీటిలో నుంచి సామగ్రి, సరుకులను బయటకు తీసుకునేందుకు నానా తంటాలు పడ్డారు.

16 మందిని రక్షించిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

మేడారాన్ని వరద ముంచెత్తడంతో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ గాస్ ఆలం ఆదేశాల మేరకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. తాడ్వాయి ఎస్సై ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, స్పెషల్ పార్టీ బృందం బోట్లతో జంపన్నవాగు వద్ద వరదలో ఓ ఇంటిపై చిక్కుకున్న వారిని, మేడారానికి వచ్చిన భక్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ బృందాలు మొత్తంగా వరదల్లో చిక్కుకున్న 16 మందిని కాపాడారు. కాగా, ఎమ్మెల్యే సీతక్క, జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పరిస్థితిని పర్యవేక్షించారు.

కేయూ పరిధిలో నేటి పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో నేడు(శుక్రవారం) జరగాల్సిన వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మా డీ మూడో సంవత్సరం, ఐదో సంవత్సరం పరీక్షలు, డిగ్రీకి సంబంధించిన పలు పేపర్ల పరీక్షలతోపాటు పీజీ కోర్సుల నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు నిర్వహించాల్సిన ప్రాక్టికల్స్ పరీక్షలు వాయిదా వేసినట్లు వెల్లడించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పరీక్షలను వాయిదా వేశామని తెలిపారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో వాయిదా పడిన పరీక్షలకు సంబంధించి రీ షెడ్యూల్ టైం టేబుల్‌ను త్వరలోనే వెల్లడిస్తామని వారు తెలిపారు. ఇదిలా ఉండగా.. యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల వర్సిటీ కళాశాలలతోపాటు అనుబంధ కళాశాలలకు నేడు సెలవు ప్రకటించినట్లు గురువారం వీసీ రమేష్ తెలిపారు. వర్షాల నేపథ్యంలో సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలు తెరుచుకోనున్నాయి.

'ముత్యంధార' పర్యాటకులు సేఫ్

- కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు


వాగు దాటుతున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం వీరభద్రవరం గ్రామ సమీపంలోని ముత్యంధార జలపాతాన్ని తిలకించేందుకు వెళ్లి బుధవారం రాత్రి వరదలో చిక్కుకున్న పర్యాటకులను ఎస్పీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో పోలీసు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా కాపాడారు. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ముత్యంధార జలపాతాన్ని తిలకించేందుకు బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వరంగల్, హైదరబాద్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలకు చెందిన 84 మంది పర్యాటకులు వీరభద్రవరం సమీపంలో వాహనాలను పార్కింగ్ చేసి అటవీ మార్గంలో ముత్యంధార జలపాతాన్ని తిలకించేందుకు వెళ్లారు. తిరిగివస్తున్న క్రమంలో భారీ వర్షం కురవటంతో జలపాతానికి వెళ్లే మార్గమధ్యలోని గజ్జల వాగు ప్రమాదస్థాయిని మించి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పర్యాటకులు ముత్యంధార జలపాతం వద్దనే చిక్కుకుపోయారు. దీంతో వారు 100కు డయిల్ చేసి విషయం అధికారులకు తెలిపారు. అప్రమత్తమైన ములుగు ఎస్పీ గౌస్ ఆలం పోలీస్ అధికారులను అప్రమత్తం చేయటంతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పర్యాటకులను కాపాడేందుకు వీరభద్రవరం గ్రామానికి తరలించారు. ఘటనా స్థలానికి ఎస్పీ వెళ్లి పర్యవేక్షించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతోపాటు వీరభద్రవరం గ్రామస్తులు రాత్రి పది గంటలకు రోప్ సాయంతో వాగు దాటి పర్యాటకులను కాపాడేందుకు వెళ్లారు. అర్ధరాత్రి రెండు గంటల వరకు శ్రమించి వాగు అవతల ఉన్న పర్యాటకులను సురక్షితంగా తీసుకొచ్చారు. రిస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతి రావు, తాహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు తదితరులు ఉన్నారు.

'ముత్యంధార' సందర్శన క్లోజ్

ముత్యంధార జలపాతం సందర్శన నిషేధించినట్లు గురువారం అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. పర్యాటకులు ఎవరూ జలపాతానికి వెళ్లకుండా వీరభద్రవరం గ్రామ సమీపంలో అటవీశాఖ సిబ్బంది కాపలా ఉన్నారు.

రైతులు చిక్కుకున్నారు.. పోలీసులు కాపాడారు


బయటకు వచ్చిన రైతులతో డీఎస్పీ, సీఐ

కాటారం: పొలాల వద్ద ఉన్న తమ ట్రాక్టర్లు, మోటార్లను తీసుకురావడానికి వెళ్లి వరదల్లో చిక్కుకున్న రైతులను రెస్క్యూ చేసి కాపాడి శభాష్ అనిపించుకున్నారు కాటారం పోలీసులు. కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రంజిత్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు మూడు గంటల పాటు శ్రమించి వరదలో ఉన్న రైతులను డ్రోన్ ద్వారా గుర్తించి ప్రత్యేక బోట్ సాయంతో సురక్షిత ప్రాంతానికి తరలించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన రైతులు ఆజ్మీరా రాజు, సంతోషం రాజు, సకినాల రాజయ్య, బూత్కం శేఖర్ మానేరు సమీపంలోని తమ పంట పొలాల వద్ద ఉన్న మోటార్లు, ట్రాక్టర్లు వరద తాకిడికి కొట్టుకుపోయే ప్రమాదం ఉండటంతో తీసుకురావడానికి ఉదయం వెళ్లారు. అకస్మాత్తుగా మానేరులో నీటి ప్రవాహం పెరిగి చుట్టేయడంతో వరదల్లో చిక్కుకున్నారు. కుటుంబ సభ్యుల సమాచారంతో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రంజిత్‌రావు సంఘటనా స్థలానికి చేరుకొని ఆరా తీసినప్పటికీ.. వరద నీరు చుట్టూ కమ్మేయడంతో రైతుల ఆచూకీ లభించలేదు. పోలీసులు డ్రోన్ కెమెరా సాయంతో రైతులను గుర్తించారు. డీఎస్పీ, సీఐ కాళేశ్వరం నుంచి వెంటనే ప్రత్యేక బోట్, గజ ఈతగాళ్లను రప్పించి రైతుల వద్దకు వెళ్లి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. నలుగురు రైతులు వరదల్లో చిక్కుకోవడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. రైతులు క్షేమంగా ఒడ్డుకు చేరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, బీఆర్ఎస్ జిల్లా యూత్ నాయకుడు జక్కు రాకేశ్, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పరిశీలించారు.

ఐబీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను కాపాడిన గ్రామస్తులు..


హరికుమార్‌ను బయటకు తీసుకొస్తున్న గ్రామస్తులు

కొత్తగూడ: తెగిన చెరువుల ఫొటోలు తీసుకునేందుకు వెళ్లిన ఐబీ ఫీల్డ్ అసిస్టెంట్ మోకాళ్ల హరికుమార్ వేలుబెల్లిచెరువు మత్తడి వాగులో ద్విచక్రవాహనంతో సహా కొట్టుకుపోయాడు. వాగులో చెట్టు కొమ్మ పట్టుకుని బిక్కుబిక్కుమంటూ ఉన్న హరికుమార్‌ను గ్రామస్తులు తాడు సాయంతో కాపాడారు. తాను చనిపోతాననుకున్నానని.. గ్రామస్తులు పునర్జన్మనిచ్చారని హరికుమార్ కన్నీరు పెట్టుకున్నారు.